ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: “పునరుత్థాన దినాన ప్రజలు చెప్పులు లేకుండా, బట్టలు లేకుండా, మరియు సున్తీ చేయని స్థితిలో (హషర్ మైదానంలో) జమ చేయ బడతారు.”

విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా రదియల్లాహు అన్హా ఉల్లేఖన: “రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా పలుకగా నేను విన్నాను: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: “పునరుత్థాన దినాన ప్రజలు చెప్పులు లేకుండా, బట్టలు లేకుండా, మరియు సున్తీ చేయని స్థితిలో (హషర్ మైదానంలో) జమ చేయ బడతారు.” నేను అడిగాను: “ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం! సమీకరించబడిన స్త్రీలు మరియు పురుషులు ఒకరినొకరు చూసుకుంటారా?” దానికి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బదులిచ్చారు: “ఓ ఆయిషా! ఆ సమయంలో పరిస్థితి ఒకరినొకరు చూసుకోవడం కంటే చాలా తీవ్రంగా, గంభీరంగా ఉంటుంది.” [ప్రామాణికమైన హదీథు] [అల్ బుఖారీ మరియు ముస్లిం నమోదు చేసినారు]

ఈ హదీథులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పునరుత్థాన దినం యొక్క కొన్ని లక్షణాలను వివరించారు. తీర్పు కోసం ప్రజలు తమ సమాధుల నుండి పునరుత్థానం చేయబడిన (లేపబడిన) తర్వాత ఒకచోట సమీకరించబడతారు. వారు కాళ్ళకు చెప్పులు లేకుండా, బట్టలు లేకుండా, ఏ ఆచ్ఛాదనా లేకుండా, నగ్నంగా ఉంటారు. వారి తల్లులు వారిని కన్న దినాన ఉన్నట్లుగా వారు వొడుగులు (సున్తీ) చేయని స్థితిలో ఉంటారు. ఆయిషా రదియల్లాహు అన్హా ఇది వినగానే, ఆమె ఆశ్చర్యంతో ఇలా అడిగారు: “ఓ రసూలుల్లాహ్! అపుడు స్త్రీలు, పురుషులు ఒకరినొకరు చూసుకుంటారా?” అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆమెకు ఇలా వివరించినారు: (అల్లాహ్ ముందు) నిలబడటం మరియు పునరుత్థానం తర్వాత ఒక చోట సమీకరించబడడం - ఆ పరిస్థితి చాలా భయంకరమైన సంఘటనలతో నిండి ఉంటుంది, ప్రజలు ఇతరుల నగ్నత్వాన్ని కూడా గమనించలేనంతగా (తమ విషయంలో ఏమని తీర్పు వెలుపడుతుందో అని) భయకంపితులై ఉంటారు.

https://www.sunnah.global/hadeeth/te/show/5460